సాక్షి నల్లగొండ

మంగళవారం । 16 । జూలై । 2024



బదిలీలు జరిగేనా..
మోడల్ స్కూల్ టీచర్లు 11 ఏళ్లుగా బదిలీలు, పదోన్నతులకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు.
- 8లో



గుట్కా ప్యాకెట్లు స్వాధీనం
సూర్యాపేటలో భారీగా గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
- 8లో

గరిష్టం / కనిష్టం
31°/ 25°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

3 మి.మీ సగటు వర్షపాతం

నల్లగొండ టౌన్ : ఉపరితల ద్రోణి కారణంగా జిల్లాలో 3 మిల్లీమీటర్ల సగటు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలో అత్యధికంగా చిట్యాల మండలంలో 18.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా అనుమలలో 0.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శాలిగౌరారంలో 15.5, నార్కట్‌పల్లి 15.1, మర్రిగూడ 6.9, గట్టుప్పల్ 4.5, కట్టంగూరు 4.3, చింతపల్లి 3.5, చండూరు 3.3, నల్లగొండ 2.8, మునుగోడు 2.6, తిప్పర్తి 2.3, గుండ్లపల్లి 2.2, గుర్రంపోడు 1.8, దేవరకొండ 1.8, నాంపల్లి 1.8, కేతేపల్లి 1.7, నకిరేకల్ 1.6, మాడుగులపల్లి 1.2, కనగల్ 1.0, కొండమల్లేపల్లి 0.9, చందంపేట 0.8, వేములపల్లి 0.3, త్రిపురారం 0.2, పీఏపల్లి మండలంలో 0.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

22న దాశరథి శతజయంతి ఉత్సవాలు

చండూరు : తెలంగాణ పీడిత ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యలను తన రచనల ద్వారా గొంతెత్తి చాటిన మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవాలను ఈనెల 22న చండూరులో సాహితీ మేఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య, ప్రధాన వ్యవహర్త మంచుకొండ చినభిక్షమయ్య తెలిపారు. సోమవారం సాహితీ మేఖల వ్యవస్థాపకుడు అంబడిపూడి వెంకటరత్నం జయంతి సందర్భంగా చండూరులో ఆయన విగ్రహానికి, దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాశరథి అగ్నిధార పుస్తకం 1949లో చండూరులో ఆవిష్కరించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కవి, రచయిత మద్దోజు సుధీర్‌బాబు, శ్రీధర్, వెంకన్న, చిన్నా, గంగాధర్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

బీఈడీ పూర్వ విద్యార్థులకు వన్‌టైం చాన్స్

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ పూర్వ విద్యార్థులకు వన్‌టైం చాన్స్ ద్వారా పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు కంట్రోలర్ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2011 – 12 నుంచి సంవత్సరం వారిగా అభ్యసించిన వారికి, 2014– 15 విద్యా సంవత్సరం నుంచి 2020 వరకు సెమిస్టర్ విధానంలో చదివిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులను వారు అభ్యసించిన కళాశాలలో ఈ నెల 30వ తేదీలోగా అందజేయాలని, రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 1వ తేదీలోగా సమర్పించవచ్చని తెలిపారు.

చెర్వుగట్టులో శతఘటాభిషేకం



సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శతఘటాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు - నార్కట్‌పల్లి

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : లా డిగ్రీ పొందిన బీసీ అభ్యర్థులు 2024–25 సంవత్సరానికి అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ శిక్షణకు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి రాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు మూడు సంవత్సరాలపాటు అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ శిక్షణ పొందాలని తెలిపారు. ఎంపికైన వారికి ఈ మూడేళ్ల కాలంలో నెలకు రూ.వెయ్యి చొప్పున ఉపకారం వేతనంతోపాటు అడ్వకేట్ ఎన్‌రోల్‌మెంట్ ఫీజు రూ.865 చెల్లిస్తారని, లా పుస్తకాలు, ఫర్నిచర్‌కు రూ.3 వేలు ఇస్తారని వివరించారు. వీరిని జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అనుసంధానం చేస్తారని తెలిపారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన అదనపు కలెక్టర్లు

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. బాధితుల వినతులను ఒకటికి రెండుసార్లు చదివి, ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. జిల్లా అధికారులను తన వద్దకు పిలిపించుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో కూడా ఇదే పద్ధతిని అనుసరిస్తే ప్రజల ఫిర్యాదులు త్వరగా పరిష్కారమవుతాయని తెలిపారు. ప్రజావాణిలో 73 ఫిర్యాదులు రాగా వీటిలో వ్యక్తిగత, భూ సంబంధిత సమస్యలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, హాస్టల్ సీట్లు తదితర అంశాలకు సంబంధించినవి ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, డీఆర్‌ఓ డి.రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, అధికారులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ఆహ్వానం

గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది నూతన ఆవిష్కరణలను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ఇంటింటా ఇన్నోవేషన్' పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆవిష్కర్తలు ఆగస్టు 3వ తేదీలోగా నూతన ఆవిష్కరణలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలను 91006 78543 ఫోన్ నంబర్‌కు వాట్సప్ ద్వారా పంపాలని తెలిపారు. ఆవిష్కర్త పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, గ్రామం, మండలం, జిల్లా, ఆవిష్కరణ పేరు, ఆవిష్కరణకు సంబంధించిన వివరణ 100 పదాలతో రాసి పంపాలన్నారు. ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు ఫొటోలు, రెండు నిమిషాల వీడియోను పంపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, డీఆర్‌ఓ డి.రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, మురళి, మాళోతు అకిల్ పాల్గొన్నారు.



ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు

ఫుడ్ సేఫ్టీ X ఎక్సైజ్

మద్యం దుకాణాల వద్ద ఆహార నాణ్యతపై చర్చ

- ఆహార విక్రయాలకు లైసెన్స్ ఉండాలంటున్న ఫుడ్‌సేఫ్టీ విభాగం
- మా శాఖ పరిధిలోని వైన్స్‌పై వారి పెత్తనమేంటని ఎక్సైజ్ శాఖ గుర్రు
- రెండు శాఖల మధ్య సమన్వయ లోపం..
- లైసెన్స్ విషయంలో గందరగోళం



వైన్స్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఫుడ్ సేఫ్టీ, ఎక్సైజ్ శాఖల మధ్య లైసెన్స్ గొడవ ముదురుతోంది. వైన్ షాపుల్లో విక్రయించే ఆహార పదార్థాలతోపాటు కల్తీ మద్యంపైనా తనిఖీలు చేసే అధికారం తమకు ఉందంటూ ఫుడ్ సేఫ్టీ అధికారులు నోటీసులు జారీ చేస్తుండగా.. తమ పరిధిలోని వైన్స్‌ల్లో వారి తనిఖీలు ఏంటని ఎక్సైజ్ శాఖ గుర్రుగా ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఫుడ్ సేఫ్టీ అధికారులు వివిధ ప్రాంతాల్లోని వైన్స్‌లు, పర్మిట్ రూమ్‌లలో విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతపై ఇటీవల తనిఖీలు చేశారు. ఫుడ్ లైసెన్స్ తీసుకోవాల్సిందేనని, లేదంటే రూ.5 లక్షల వరకు జరిమానా తప్పదని నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో ఎక్సైజ్ అధికారులు కోపంగా ఉండగా, నిబంధనలు అమలు చేయాల్సిందేనని ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయాన్ని తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి క్షేత్రస్థాయిలోని ఎక్సైజ్ అధికారులు తమ విధులకు అడ్డుపడకుండా చూడాలని కోరారు.

నిబంధనలు పట్టని వైన్స్‌లు

ఉమ్మడి జిల్లాలో 336 వైన్స్‌లు ఉండగా, అందులో నల్లగొండలో 155, సూర్యాపేటలో 99, యాదాద్రి భువనగిరి జిల్లాలో 82 మద్యం దుకాణాలు ఉన్నాయి. మెజారిటీ వైన్స్‌ల వద్ద యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆహార నాణ్యతను గాలికొదిలేసి పర్మిట్ రూమ్‌లో ఆహార పదార్థాలను విక్రయించే వారి నుంచి నెలావారీగా డబ్బులను వసూలు చేసుకుంటున్నారు. ఆహార నాణ్యతపై దృష్టి పెట్టకుండా వసూళ్లకే పరిమితమవుతూ ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు. అంతేకాదు వైన్స్‌ల వద్ద ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు ఏంటని, వారు వచ్చి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎక్సైజ్ శాఖ అధికారులకు చెప్పడంతో వారు జోక్యం చేసుకున్నారు.

ఫుడ్ విక్రయాలకు లైసెన్స్ తప్పనిసరి

ఫుడ్ సేఫ్టీ చట్టం ప్రకారం హోటల్స్, స్వీట్ షాపులు, బేకరీలు, బార్ అండ్ రెస్టారెంట్లు, ఫ్యామిలీ రెస్టారెంట్లు, మెడికల్ షాపులు, వైన్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీ కంపెనీలు, ఇతర తినుబండరాలు తయారు చేసే క్రయ, విక్రయదారులంతా తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ కార్యాలయం నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. తాగునీటి బాటిళ్లు అమ్మాలన్నా లైసెన్స్ ఉండాలి. మిర్చీ, ఇడ్లీ, ఆహార పదార్థాలను విక్రయించే చిరు వ్యాపారులు కూడా లైసెన్స్ తీసుకోవాల్సిందే. ఉపాధి కోసం బండ్లు ఏర్పాటు చేసుకునే చిరు వ్యాపారులు లైసెన్స్ తీసుకునేందుకు ముందుకు రారు. వారికంటూ ఒక దుకాణం కూడా ఉండకపోవడంతో ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కానీ నెలనెలా లక్షల రూపాయల వ్యాపారం చేసే వైన్స్ షాపుల యజమానులు లైసెన్స్ తీసుకోకపోవడంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు.

బార్ షాపులను తలపించేలా సిట్టింగ్‌లు

ఉమ్మడి జిల్లాలో చాలా వైన్స్‌ల వద్ద పర్మిట్‌రూం పేరుతో పెద్ద సిట్టింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కొన్నిచోట్ల అయితే పర్మిట్‌రూం పేరుతో వందల మంది కూర్చొని తాగే ఏర్పాట్లు ఉంటున్నాయి. ఆయా సిట్టింగ్‌ల్లో చిప్స్, పల్లీల నుంచి చికెన్, మటన్, ఫిష్, బోటీ, తలకాయ తదితర అన్ని వెరైటీల ఫుడ్స్ అందుబాటులో ఉంటున్నాయి. ఇవన్నీ ఎలాంటి అనుమతులు, లైసెన్స్ లేకుండానే విక్రయిస్తున్నారు. అయినా ఎక్సైజ్ శాఖ మిన్నకుండిపోతోంది. వైన్స్ యజమానాల నుంచి నెలవారీ మామూళ్ల కారణంగా వారు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

నాణ్యత లేని ఆహారం..

మద్యం దుకాణాల దగ్గర ఉండే సిట్టింగ్‌లలో విక్రయించే ఆహార పదార్థాల నాణ్యత ఎవరికీ పట్టడం లేదు. వారు ఏది పెడితే అది తినాల్సిందే. మందుబాబులు మరో ప్రాంతానికి వెళ్లి ఫుడ్ తెచ్చుకునే పరిస్థితి ఉండదు. దీంతో ఆహారంలో నాణ్యత లేకపోయినా వాటినే తినాల్సి వస్తోంది. కొన్ని చోట్ల పరిశుభ్రత కూడా ఉండడం లేదు. మిగిలిన ఆహార పదార్థాలు మరుసటి రోజు అమ్ముతున్నారనే చర్చ కూడా సాగుతోంది. ఇన్నాళ్లూ ఆహార నాణ్యత, లైసెన్స్ విషయాన్ని ఎవరూ అడక్కపోవడంతో చాలాచోట్ల నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా శాఖల మధ్య రగడ ఎలా ఉన్నా.. నాణ్యత కలిగిన ఫుడ్ అందించేలా చర్యలు చేపట్టాలనే వాదన మందుబాబుల నుంచి వినిపిస్తోంది.

264 మందికి డబుల్ పింఛన్

- ట్రెజరీల్లో ఆధార్ అనుసంధానంతో బయటపడ్డ వ్యవహారం
- రికవరీకి నోటీసులు జారీ చేసేందుకు సన్నాహాలు
- ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు




నల్లగొండ : జిల్లాలో 264 మంది డబుల్ పింఛన్ పొందుతున్నారు. ప్రభుత్వ సర్వీస్‌లో ఉండి రిటైర్డ్ అయి అందుకు సంబంధించిన పెన్షన్ తీసుకుంటున్న వారు తిరిగి ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్ కూడా పొందుతున్నారు. ఇటీవల ట్రెజరీ అధికారులు పెన్షన్‌దారుల అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం చేయడంతో ఈ వ్యవహారం బయట పడింది. దీంతో ట్రెజరీ అధికారులు డబుల్ పెన్షన్లు పొందుతున్న వారి జాబితాను సెర్ప్ అధికారులకు అందించారు. సామాజిక పింఛన్లు ఎప్పటి నుంచి, ఎంత మొత్తం పొందారో రికవరీ చేయాలని సంబంధిత ఎంపీడీఓలు, అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో వారు నోటీసులు అందించి వాయిదాల పద్ధతిలో రికవరీకి సిద్ధమై, కొందరికి నోటీసులు కూడా అందించాక.. ఈ ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చింది.

నిబంధనలకు విరుద్ధం

వాస్తవంగా ప్రభుత్వం 60 ఏళ్ల పైబడిన వారు కుటుంబంపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించేందుకు ఆసరా పింఛన్లు అందిస్తోంది. ప్రభుత్వ సర్వీస్ నుంచి రిటైర్డ్ అయిన వారు ఆసరా పింఛన్ పొందేందుకు అనర్హులు. కానీ, కింది స్థాయిలో రాజకీయ నాయకులు, పైరవీకారులకు అంతో ఇంతో డబ్బులు ముట్టజెప్పి ఆసరా పింఛన్లు కూడా పొందుతున్నారు. ఇలా జిల్లాలో 264 మంది రెండు రకాల పెన్షన్లు పొందుతున్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడం ఎన్నికల సందర్భంలో నాయకులు కూడా ఓట్ల కోసం అనర్హులను పింఛన్ జాబితాలో చేర్చారన్న ఆరోపణలు ఉన్నాయి.

తాత్కాలికంగా బ్రేక్..

రెండు రకాల పింఛన్లు పొందుతున్న వారు ఎంత డబ్బు పొందారనేది లెక్కలు తీసింది. వారి నుంచి ఆ మొత్తం ఒకేసారి వసూలు చేస్తే ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో సర్వీస్ పెన్షన్ నుంచి విడతల వారీగా రికవరీ చేయాలని భావించింది. అధికారులు కూడా సంబంధిత పెన్షన్‌దారులకు కొన్ని చోట్ల నోటీసులు కూడా జారీ చేశారు. ఆదివారం రికవరీ చేయాలని ఆదేశాలు ఇచ్చిన ప్రభుత్వం సోమవారం నిలిపివేయాలంటూ కలెక్టర్లకు సూచించింది. దీంతో ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.



రాచకొండలో ఇలాంటి జలపాతాలెన్నో..

మళ్లీ తెరపైకి..
ఫిలిం సిటీ

రాచకొండలో ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

- ఈ ప్రాంతం అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు
- గతంలో మాజీ సీఎం కేసీఆర్ ఏరియల్ సర్వే
- పదేళ్లయినా కార్యరూపం దాల్చని ప్రాజెక్టు
- తాజా ప్రకటనతో సర్వత్రా హర్షం



రాచకొండలో అందమైన లోయ

సంస్థాన్ నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా రాచకొండ ఫిలింసిటీ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. తాజాగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని లష్కర్‌గూడలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి రాచకొండ ప్రాంతంలో ఫిలింసిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీంతో రాచకొండ ప్రాంత అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. రాచకొండ అభివృద్ధిపై మాజీ సీఎం కేసీఆర్ 2014లో ఏరియల్ సర్వే నిర్వహించి రెండు వేల ఎకరాల్లో ఫిలిం సిటీ నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే అది కార్యరూపం దాల్చలేదు. రాచకొండ ప్రాముఖ్యతను వెలుగులోకి తీసుకురావడానికి దేశంలోనే అతిపెద్ద రెండో సైబరాబాద్ ఈస్ట్ కమిషనరేట్‌కు అప్పటి ప్రభుత్వం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌గా నామకరణం చేసింది. ఫిలింసిటీతో పాటు మరికొన్ని ప్రాజెక్టులు వస్తాయని ఇక్కడి ప్రజలు భావించారు. కానీ, పదేళ్లుగా ఎటువంటి ప్రాజెక్టులు రాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి తాజా ప్రకటనతో ఫిలింసిటీ ఏర్పాటుపై కదలిక మొదలైంది. రాచకొండ ప్రాంతం యాద్రాదిభువనగిరి, రంగారెడ్డి జిల్లాల సరిహద్దులోని సంస్థాన్ నారాయణపురం మండలంలో 35వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇది హైదరాబాద్‌కు 40కి.మీ. నారాయణపురం మండల కేంద్రం నుంచి 20కి.మీ., చౌటుప్పల్ నుంచి 30కి.మీ.దూరంలో ఉంది. శంషాబాద్ విమానాశ్రయానికి కేవలం 25కిలో మీటర్ల దూరంలో ఉండడంతో దీని అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించినట్టు తెలుస్తోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సినిమా షూటింగ్‌లకు నిలయంగా..

రాచకొండ ప్రాంత మంతా గుట్టలతో నిండి ఉంది. ప్రకృతి అందాలను మైమరపించే లొకేషన్లతోపాటు, గుట్టలపై నుంచి జాలువారే సెలయేళ్లు ఉన్నాయి. అపురూప కట్టడాలు, చారిత్రక సంపద సినీ డైరెక్టర్లను ఆకర్షిస్తోంది. దీంతో రాచకొండ గుట్టల్లో ఎన్నో సినిమాలు రూపుదిద్దుకున్నాయి. మల్కాపురం ఘాట్ కంచె భూముల్లో రెబల్ చిత్రం క్లైమాక్స్ సన్నివేశం, పవన్‌కళ్యాణ్ నటించిన గబ్బర్ సింగ్ సినిమా చివరి సన్నివేశాన్ని కూడా ఇక్కడే చిత్రీకరించారు. మహేష్‌బాబు.. ఆగడు చిత్రం క్లైమాక్స్ ఫైట్‌ను కూడా ఇక్కడే చిత్రీకరించారు.



నాగచైతన్య, సాయిపల్లవి హీరో, హీరోహిన్‌గా నటించిన లవ్‌స్టోరీ సినిమాలోని కొన్ని సన్నివేశాలు ఇక్కడే చిత్రీకరించారు. ఇంకా ఎన్నో సినిమాల క్లైమాక్స్‌లు, ఫైటింగ్ సన్నివేశాలు ఇక్కడే చిత్రీకరించారు. వీటితోపాటు అనేక సీరియళ్లు, షార్ట్ ఫిలింలు చిత్రీకరించారు.

ప్రకృతి అందాలు, చారిత్రక కట్టడాలకు పెట్టింది పేరు

రాచకొండ ప్రాంతం ప్రకృతి రమణీయతకు చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలకు పెట్టింది పేరు. ఎత్తైన కొండలు, చిట్టడవిలో పక్షుల కిలకిల రావాలు, సెలయేళ్లు, జలపాతాలను చూస్తూ మైమరచిపోయే ప్రాంతం రాచకొండ. రాచకొండ అలనాడు పద్మనాయక వంశీయుల పాలనలో తెలంగాణ ప్రాంతానికి రాజధానిగా వెలిసిన గొప్ప నగరం. నేడు సెలవు రోజులు వస్తే సందర్శకులతో రాచకొండ సందడిగా మారుతుంది.

ఫిలిం సిటీపై సీఎం నిర్ణయం హర్షణీయం



రాచకొండలో ఫిలింసిటీ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయం. వెంటనే రాచకొండ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. ఫిలిం సిటీతోపాటు పర్యాటక కేంద్రంగా, టెంపుల్ సిటీగా తీర్చిదిద్ది మౌలిక వసతులు కల్పించాలి.
– వెంకటేశం, రాచప్ప సమితి ప్రధాన కార్యదర్శి

పర్యాటకులను ఆకర్షించేలా..

రాచకొండ చారిత్రక నేపథ్యం ప్రతిబింబించేలా అటవీ శాఖ అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. పర్యాటకులు ఆకర్షించేలా రాచకొండను తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే రాచకొండ ఫారెస్ట్ బీట్‌లో 657 ఎకరాల్లో ఎకో టూరిజం అర్బన్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. వివిధ రకాల 2,500 మొక్కలు నాటించారు. రాచకొండ ప్రకృతి అందాలను చూసేలా అతి పెద్ద వ్యూ పాయింట్ నిర్మించారు.

ప్రతిపాదనలకే పరిమితం..

రాచకొండ గుట్టల్లో మావోయిస్టులు(పీపుల్స్‌వార్) ఉద్యమం చాలకాలం కొనసాగించారు. రాష్ట్రంలోనే రాచకొండ దళానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ దేశ రక్షణశాఖ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు 1992లో అధికారులు ప్రతిపాదించారు. ప్రజా వ్యతిరేకత రావడంతో అనంతపురం జిల్లాకు తరలించారు. తర్వాత కాలంలో బీడీఎల్ కంపెనీ మిసైల్ ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు సిద్ధంకావడంతో గిరిజనుల వ్యతిరేకతతో విరమించుకున్నారు. ఆ తర్వాత రాచకొండలో ఐటీ పార్కు, కృషి విజ్ఞాన కేంద్రం, నెమళ్ల పార్కు, టెంపుల్ సిటీ, ఫిలిం సిటీ, పర్వతారోహణం, రోప్‌వే, స్పోర్ట్స్ సిటీ, ఎడ్యుకేషన్ హబ్, స్మార్ట్ సిటీ, రైలు బోగీల పరిశ్రమ, ఇండస్ట్రియల్ కారిడార్ వంటి ప్రాజెక్టుల ఏర్పాటుపై ప్రతిపాదనలు వచ్చాయి. రాచకొండకు హైదరాబాద్ నుంచి, శంషాబాద్ నుంచి, హైదరాబాద్–విజయవాడ హైవే నుంచి నాలుగు లేన్ల రోడ్డు అభివృద్ధి లాంటివి నేటికీ ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.

క్లుప్తంగా

ట్రాక్టర్ తిరగబడి రైతు మృతి

మద్దిరాల: పొలంలో దిగబడిన ట్రాక్టర్‌ను బయటకు తీస్తుండగా రైతు మృతి చెందాడు. ఈ ఘటన మద్దిరాల మండలం చందుపట్ల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన గొడిచర్ల భిక్షం(60) ట్రాక్టర్‌తో తన వ్యవసాయ భూమిని దున్నుతుండగా ట్రాక్టర్ దిగబడింది. దీంతో అతడు ట్రాక్టర్ వెనుకభాగంలో ఉన్న కల్టివేటర్‌ను తీసేసి ట్రాక్టర్‌ను బయటికి తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ముందుభాగం ఒక్కసారిగా పైకి లేవడంతో వెనకాల ఉన్న కల్టివేటర్‌కు, స్టీరింగ్‌కు మధ్య అతడు ఇరుక్కుని ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. భిక్షం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా అతడు మృతిచెంది ఉన్నాడు. వెంటనే స్థానికులు పోలీసులకు విషయం తెలియజేయడంతో వారు అక్కడకు చేరుకొని మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని పిలాయిపల్లి పరిధిలోని సాయిబాలాజీ రైస్ మిల్లులో సోమవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గత యాసంగి, వానాకాలం సీజన్లకు సంబంధించిన ధాన్యం స్టాక్ రికార్డులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ఎంత ధాన్యం కొనుగోలు చేశారని, తరువాత ఎంత లిఫ్టింగ్ చేశారని అడిగి తెలుసుకున్నారు. అలాగే మిగిలిన ధాన్యం స్టాక్ బస్తాలను లెక్కించారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో వికారాబాద్ జిల్లా సివిల్ సప్లై మేనేజర్ సుగుణబాయి, ఓఎస్‌డీ కృష్ణ, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, సివిల్ సప్లై డీటీ బాలమణి, ఆర్‌ఐ నర్సింహారెడ్డి ఉన్నారు.

100 కేజీల బెల్లం పట్టివేత



పట్టుబడ్డ నిందితుడు, బెల్లం, బైక్‌ను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: సారా తయారీకి తరలిస్తున్న 100 కేజీల బెల్లంను సోమవారం హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన కిరాణా వ్యాపారి కండిబండ చంద్రశేఖర్ సారా తయారీ కోసం తన బైక్‌పై సుమారు 100 కేజీల బెల్లంను తరలిస్తుండగా.. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ అధికారులు స్థానిక బస్టాండ్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని బెల్లంతో పాటు బైక్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది నాగరాజు, రవి కుమార్, నవీన్, గోపిరెడ్డి, మణికంఠ, సంజయ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

చౌటుప్పల్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగిరాలేదు. ఈ ఘటన ఆదివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన ఉప్పరి కృష్ణసారథి(27) బీటెక్ వరకు చదువుకున్నాడు. ఉద్యోగ వేటలో భాగంగా చౌటుప్పల్‌లో నివాసముంటున్న ఉంటున్న తన అక్క వద్దకు 15రోజుల క్రితం వచ్చాడు. ఆ క్రమంలో ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన కృష్ణసారథి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా, బంధువులను వాకబు చేసినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

జూదరుల అరెస్ట్

పాలకవీడు: మండల పరిధిలోని హనుమయ్యగూడెం గ్రామంలో పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు.

ఆ ఇంటి పెద్దను ఆదుకోరూ..

- సెల్యూలైటిస్ వ్యాధితో బాధపడుతున్న శివలింగం
- ఇప్పటికే వైద్యం కోసం రూ.8లక్షలు ఖర్చు చేసిన కుటుంబ సభ్యులు
- మరో రూ.7లక్షలు అవసరమంటున్న వైద్యులు

కన్నీటి గాథ

వేములపల్లి: ఆ ఇంటి పెద్ద సెల్యూలైటిస్ అనే వ్యాధితో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి వైద్య ఖర్చులు భారంగా మారాయి. దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బారి శివలింగంయాదవ్, ముత్తమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. 2023లో వారి పెద్ద కుమారుడు బారి వెంకన్నయాదవ్ పొలంలో పనిచేస్తుండగా మూర్ఛ రావడంతో కిందపడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అదే ఏడాది రెండో కుమారుడు జగన్‌యాదవ్ ట్రాక్టర్ ప్రమాదంలో మరణించాడు. మూడో కుమారుడు నాగరాజుయాదవ్ దివ్యాంగుడు. శివలింగంయాదవ్ కొన్ని వారాలుగా సెల్యూలైటిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి కారణంగా శివలింగం యాదవ్ కణజాల వ్యవస్థలో రక్త ప్రసరణ ఆగిపోయి కుడి కాలికి గాయాలయ్యాయి. దీంతో కాలు తీసేసే పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యాధి పదివేల మందిలో ఒకరికి మాత్రమే వస్తుందని వైద్యులు తెలిపారు. శివలింగంయాదవ్‌ను చికిత్స నిమిత్తం మిర్యాలగూడ పట్టణంలోని ఆస్పత్రిలో చేర్పించి అక్కడ రూ.55వేలు ఖర్చు చేశారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌కు తీసుకెళ్లారు. నెల రోజుల వ్యవధిలో రూ.8లక్షలు ఖర్చయినప్పటికీ వ్యాధి తగ్గలేదు. వైద్య ఖర్చులకు మరో రూ.7లక్షలు అవసరమవుతాయని వైద్యులు చెబుతున్నారని, కూలీ పనులకు వెళ్లి బతికే తమ దగ్గర అంత డబ్బులు లేవని భార్య ముత్తమ్మ, కుమారుడు నాగరాజుయాదవ్ విలపిస్తున్నారు. దాతలు సహాయం అందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న శివలింగం యాదవ్

పేరు : బారి నాగరాజు
ఫోన్ పే, గూగుల్ పే నంబర్ :
9000033557

నా భర్తను కాపాడండి



నా భర్త వైద్యం కోసం రూ.8లక్షల దాకా ఖర్చు చేశాం. వ్యాధి నయం కావాలంటే ఇంకా రూ.7లక్షల దాకా అవుతుందని వైద్యులు చెబుతున్నారు. మాకు ముగ్గురు కొడుకులు కాగా ఇద్దరు చనిపోయారు. మూడో కుమారుడు దివ్యాంగుడు. మా దగ్గర చిల్లిగవ్వ లేదు. నా భర్తను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు. దయచేసి దాతలు సహాయం అందించి నా భర్తను కాపాడండి.

– బారి ముత్తమ్మ, శివలింగం భార్య

యాదాద్రిలో వన మహోత్సవం



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అర్చకులు

యాదగిరిగుట్ట: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో సోమవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తితో పాటు ఆలయ అధికారులు గిరి ప్రదక్షిణ, తులసీ కాటేజీ తదితర ప్రాంతాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. స్వాతి నక్షత్రం సందర్భంగా వన మహోత్సవం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని ఆలయాధికారులకు సూచించారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీరికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం కొండపైన అతిథి గృహం వద్ద వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.



శైలజా రామయ్యర్‌కు స్వామివారి చిత్రపటానికి ఇస్తున్న ఈఓ, పక్కన కమిషనర్ హన్మంతరావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు

అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన లారీ



చెరువులో పడిపోయిన లారీ



రోడ్డుపై పడిన ఇటుకలు, లారీ డోర్

భూదాన్‌పోచంపల్లి: ఇటుకల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నారాయణగిరి నుంచి ఇటుకల లోడుతో లారీ పోచంపల్లి మీదుగా కుషాయిగూడెంకు వెళ్తుండగా జలాల్‌పురం చెరువు సమీపంలోకి రాగానే మూలమలుపు వద్ద అదుపుతప్పింది. డ్రైవర్ లారీని అదుపు చేస్తుండగా స్టీరింగ్ రాడ్ విరిగి.. సమీపంలో ఉన్న చెరువులోకి లారీ దూసుకెళ్లింది. కుదుపుతో రోడ్డుపై కొన్ని ఇటుకలు, లారీకి సంబంధించిన భాగాలు పడిపోయాయి. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



ఇజాక్ (ఫైల్)

మునుగోడు: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం నల్లగొండ పట్టణంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని కమ్మగూడేనికి చెందిన ఆళ్ల ఇజాక్(42) తన పిల్లల చదువుల కోసం ఏడాది క్రితం కుటుంబంతో కలిసి నల్లగొండకు పట్టణానికి వలస వచ్చి మర్రిగూడ సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కొన్నేళ్లుగా అతడు మద్యానికి బానిస కావడంతో ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయి. తనకు ఎవరూ మద్యం కొనివ్వడం లేదని సోమవారం నల్లగొండలో తాను నివాసం ఉంటున్న అద్దె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. పక్కంటివాళ్లు గమనించి వెంటనే అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉష, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లగొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుడి దాడి

- బైక్‌పై వెళ్తున్న తనకు సైడ్ ఇవ్వలేదని ఘాతుకం

నాంపల్లి: రోడ్డుపై వెళ్తున్న తనకు సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై యువకుడు దాడి చేశాడు. ఈ ఘటన సోమవారం నాంపల్లి మండలం ముష్టిపల్లి గ్రామంలో జరిగింది. ప్రయాణికులు, కండక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు సోమవారం నాంపల్లి మీదుగా హైదరాబాద్ వెళ్తోంది. నాంపల్లి మండలం రాజ్యాతండా వద్ద ఎదురుగా బైక్‌పై వస్తున్న తనకు బస్సు డ్రైవర్ సైడ్ ఇవ్వలేదనే కోపంతో మేళ్లవాయి గ్రామానికి చెందిన వేముల అమరేందర్ బస్సును ఐదు కిలోమీటర్లు వెంబడించాడు. ముష్టిపల్లి వద్ద ప్రయాణికులు దిగుతుండగా బస్సులోకి దూరిన అమరేందర్ డ్రైవర్ రాములును అసభ్య పదజాలంతో దూషిస్తూ విచక్షణారహితంగా దాడి చేశాడు. ప్రయాణికులు, కండక్టర్ అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆటోలు, బైక్‌లకు సైడ్ ఇవ్వకుండా బస్సు నడిపితే చంపేస్తానని హెచ్చరిస్తూ వెళ్లిపోయాడు. బస్సు డ్రైవర్, కండక్టర్ దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మట్టి తరలింపు.. కేసు నమోదు

చౌటుప్పల్: అనుమతులు లేకుండా చెరువు నుంచి మట్టిని తరలించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి ఊర చెరువు నుంచి అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆదివారం రాత్రి పెద్దఎత్తున మట్టిని తరలించారు. స్థానికుల సమాచారం మేరకు నీటిపారుదల శాఖ డీఈ రాజవర్ధన్‌రెడ్డి సోమవారం చెరువును సందర్శించారు. మట్టిని తరలించిన పలువురిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

భువనగిరి క్రైం: పీడీఎస్ బియ్యం సేకరిస్తున్న వ్యక్తి నుంచి పోలీసులు సోమవారం 4.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని బిల్యానాయక్ తండాకు చెందిన గుగులోతు సాయి భువనగిరి పట్టణంలో 4.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సేకరించగా.. అతడి వద్ద నుంచి బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు భువనగిరి పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు.

శాఖాపురంలో 16 క్వింటాళ్లు..

నిడమనూరు: మండలంలోని శాఖాపురం గ్రామంలో నిల్వ చేసిన 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం ఉదయం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బీబీనగర్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బీబీనగర్ మండల కేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన చెలిమెల వేణుగోపాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 13వ తేదీన విజయవాడలోని కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి 1.50 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి చేరుకున్న వేణుగోపాల్ ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గొర్రెపొట్టేళ్ల అపహరణ

మద్దిరాల: గుర్తుతెలియని వ్యక్తులు గొర్రె పొట్టేళ్లను అపహరించారు. ఈ ఘటన మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన గాడ్దుల లింగయ్య ఆదివారం తన గొర్రెలను మేపి సాయంత్రం ఇంటి వెనకాల గల దొడ్డిలోకి తోలాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి మందలోని రెండు గొర్రె పొట్టేళ్లను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం మందలోని రెండు గొర్రె పొట్టేళ్లు లేకపోవడం గమనించిన లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కొంతమంది అనుమానితులను గుర్తించి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ మధు నాయుడు తెలిపారు.

- వ్యవసాయ పనుల్లో ఎమ్మెల్యే సామేల్





తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అడ్డగూడూరు మండలం ధర్మారంలో సోమవారం తన వ్యసాయ క్షేత్రంలో వరినాట్ల పనుల్లో మునిగిపోయారు. వరినారును కూలీలతో కలిసి పంచారు. కూలీలతో సరదాగా ముచ్చటిస్తూ వారితోపాటు పనుల్లో నిమగ్నమయ్యారు. – అడ్డగూడూరు

భారీగా గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, చిత్రంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి

సూర్యాపేటటౌన్: పట్టణంలో భారీగా గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఈ కేసు వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. ఆదివారం తెలవారుజామున సూర్యాపేట పట్టణ సీఐ తన సిబ్బందితో కలిసి సూర్యాపేట పట్టణంలోని శంకర్ విలాస్ సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. రెండు ఆటోల్లో ప్రభుత్వం నిషేధించిన గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తులకు సంబంధించిన బస్తాలు లభించాయి. వారిచ్చిన సమాచారం మేరకు పోలీసులు కూరగాయల మార్కెట్‌లో గల మంజు బేకరీ వద్దకు వెళ్లి దుకాణంలో తనిఖీ చేయగా.. ఆ దుకాణం వెనుక గదిలో రూ.6లక్షల విలువ గల గుట్కా, పొగాకు ఉత్పత్తుల బస్తాలను పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన మాయదేవర శివసత్తి కొంతకాలంగా కర్ణాటక ప్రాంతం నుంచి గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేసి వాటిని పట్టణానికి తీసుకొచ్చి తన బేకరీలో ఉంచి ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని ఎస్పీ తెలిపారు. శివసత్తితో పాటు ఆటో డ్రైవర్ యర్రంశెట్టి నవీన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.11 లక్షల విలువ గల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని 2 వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు. ఎవరైనా గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తులు అమ్మితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కేసును ఛేదించిన పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ మహేంద్రనాథ్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ రవి పాల్గొన్నారు.

పంటల మద్దతు ధరపై చట్టం చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి



హుజూర్‌నగర్‌రూరల్ : రైతులతో కలిసి నినాదాలు చేస్తున్న జూలకంటి రంగారెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్: స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర నిర్ణయించి పార్లమెంట్‌లో చట్టం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఆయన హుజూర్‌నగర్‌మండలం లింగగిరిలో రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం నుంచి రైతాంగానికి ప్రతి ఏడాది మద్దతు ధర విషయంలో నష్టం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో రైతాంగం ఎదుర్కొన్న సమస్యలు వర్ణనాతీతం అన్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, రుణమాఫీ, వ్యవసాయ ప్రణాళిక చేపట్టాలని, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతులకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, బ్రహ్మం, సైదులు, హుస్సేన్, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం



బురదమయమైన రోడ్డులో అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన పాఠశాల బస్సు

అర్వపల్లి: సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలోని వేల్పుచర్ల గ్రామ ఫార్మేషన్ రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాలకు బురదమడుగులా తయారైంది. సోమవారం అర్వపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు గ్రామానికి వెళ్లి పిల్లలను తీసుకొని వస్తుండగా బురదమడుగులా మారిన రోడ్డుపై బస్సు అదుపుతప్పి రోడ్డుపక్కన ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. అయితే డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పిల్లలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. తమ గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులంటున్నారు.

బదిలీలు జరిగేనా..

- 11 ఏళ్లుగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న మోడల్ స్కూల్ టీచర్లు
- ఉమ్మడి జిల్లాలో 33 మోడల్ స్కూళ్లు.. 564 మంది టీచర్లు
- గత ఏడాది బదిలీల షెడ్యూల్ విడుదల
- కొందరు కోర్టుకెళ్లడంతో నిలిచిన ప్రక్రియ
- సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవతీసుకోవాలని వేడుకోలు



పసునూరు మోడల్ స్కూల్

సూర్యాపేటటౌన్ : మోడల్ స్కూల్ టీచర్లు బదిలీలు, పదోన్నతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియామకమైనప్పటి నుంచి ఒకే చోట 11 ఏళ్లుగా పనిచేస్తున్నా బదిలీలు, పదోన్నతులకు నోచుకోవడంలేదు. గత ఏడాది బదిలీల షెడ్యూల్ విడుదలైనా కొందరు కోర్టు కెళ్లడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం తీర్పు రిజర్వులో ఉంది. అన్ని విభాగాల్లో బదిలీలు, పదోన్నతులు చేపడుతోన్న సర్కారు తమ సమస్యల విషయంలో సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని మోడల్‌స్కూల్ టీచర్లు కోరుతున్నారు.

2013–14లో ఏర్పడిన మోడల్ స్కూళ్లు..

జాతీయ విద్యావిధానంలో భాగంగా 2013–14 విద్యా సంవత్సరంలో మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు కేంద్రం శ్రీకారం చుట్టింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతికి 100 మంది చొప్పున ఒక్కో పాఠశాలలో 500 మంది, ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఒక్కో గ్రూపులో 40 మంది చొప్పున 320 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలల అభివృద్ధి, హాస్టళ్ల ఏర్పాటు, వసతుల కల్పన, బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

11ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్నా..

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 33 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో నల్లగొండలో 17, సూర్యాపేటలో తొమ్మిది, యాదాద్రిభువనగిరి జిల్లాలో ఏడు స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 564 మంది టీచర్లు 11 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్నారు.

కారుణ్య నియామకాలు లేక..

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు వివిధ కారణాలతో చనిపోతే వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టడంలేదు. దీంతో చనిపోయిన టీచర్ల కుటుంబ సభ్యులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా ఉపాధ్యాయుల మాదిరిగా తమకు హెల్త్ కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వారు పేర్కొంటున్నారు.

2013 లో నియామకమైనప్పటి నుంచి ఇప్పటివరకు వీరికి బదిలీలు, పదోన్నతులు చేయలేదు. గత ఏడాది వీరికి బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి షెడ్యూల్ విడుదల చేసింది. కానీ కొంత మంది టీచర్లు బదిలీలపై కోర్టు కు వెళ్లడంతో స్టే విధించింది. దీంతో బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. వాదనలు విన్న కోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి లో తీర్పును రిజర్వ్ లో పెట్టింది. ఇంతవరకు జడ్జిమెంట్ రాక ఉపాధ్యాయులు బదిలీల విషయంలో ఆందోళన చెందుతున్నారు.

పదోన్నతులు, బదిలీలు పొందలేక...

అర్హులైన ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు(టీజీటీలు) పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు)గా, పీజీటీలు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి పొందలేకపోతున్నారు. ఒకేచోట ఏళ్లతరబడి పని చేయడంతో అజమాయిషీ కొరవడుతోందంటున్నారు. అన్ని విభాగాల్లో బదిలీలు, పదోన్నతులు చేపడుతున్న ప్రభుత్వం మోడల్ స్కూళ్ల లో చేపట్టకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

జడ్జిమెంట్ వచ్చేలా చూడాలి



మోడల్ స్కూల్ టీచర్ల బదిలీల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని జడ్జిమెంట్ వచ్చేలా ప్రయత్నం చేయాలి. 010 అమలు చేసి 1వ తేదీన వేతనాలు చెల్లించాలి. హెల్త్ కార్డులు మంజూరు చేస్తే బాగుంటుంది.

– భూతం యాకమల్లు, తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

మా సమస్యను పరిష్కరించాలి



మోడల్ స్కూల్ టీచర్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి. 010 పద్దును అమలు చేయాలి. హెల్త్ కార్డులు అందించాలి. బదిలీల విషయంలో తొందరగా కోర్టు తీర్పు వెలువడేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– మహ్మద్ ఖలీల్ అహ్మద్, పీఎంటీఏ రాష్ట్ర కార్యదర్శి

న్యాయం చేయాలి



బదిలీల అంశంపై కోర్టు తీర్పు తొందరగా వెలువడేలా ప్రభుత్వం చొరవ చూపి మోడల్ స్కూల్ టీచర్లకు న్యాయం చేయాలి. మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు త్వరగా పరిష్కరించాలి. 010 పద్దు కింద వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

– తరాల జగదీష్, ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు